క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశానికి నిర్వహించే వీటీజీ సెట్ 2023 దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 16వ తారీకు నుంచి 20వ తారీకు వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థిని, విద్యార్థులు టీజీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు www.tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోరాట ఫలితమే రద్దు

దుమ్ముగూడెం: బహుజన సమాజ్ పార్టీ పోరాట ఫలితంగానే టీఎస్పీఎస్సీ పరీక్షలు రద్దయ్యాయని బీఎస్పీ దుమ్ముగూడెం మండల కోకన్వీనర్ కంచర్ల సింహాద్రి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సీతానగరంలో సెక్టార్ అధ్యక్షుడు దనగం వంశీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆఎస్ ప్రవీణ్‌కుమార్ పోరాట ఫలితంగానే పరీక్షలు రద్దైనట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కొప్పుల నారాయణ, సాగర్, ఈటె క్రాంతి పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ప్రాధాన్యత

అశ్వారావుపేటరూరల్: మట్టి, రాళ్లతో ఉన్న అంతర్గత రోడ్లను సీసీ రహదారులుగా మార్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిధిలోని గుర్రాల చెరువు గ్రామ పంచాయతీకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో రూ.5లక్షల వ్యయంతో మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ కారణంగా నియోజకవర్గానికి రూ.30 కోట్లతో సీసీ రోడ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ నిధులతో చాలా వరకు అంతర్గత రహదారుల సమస్యలు తొలగిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలపాల దుర్గయ్య, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్ రెడ్డి, జే వెంకన్న, బి.శ్రీనివాస్, గుడవర్తి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరుటౌన్: మణుగూరు, పినపాక మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూ నిర్వాసిత ఉద్యోగుల సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందించారు. పినపాక మండలం పెంటన్నగూడెం గ్రామానికి చెందిన నల్లూరి జ్యోతి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా.. మందుల కొనుగోలు కోసం రూ.10 వేలు సహకారం అందించారు. మణగుడూరు మండలంలోని రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన ఉప్పనూతల బిక్షపతి–అనిత దంపతులు 5 నెలల కుమార్తె భవ్యశ్రీ అనారోగ్యంతో బాధపడుతుండగా.. రూ.10 వేల సహాయం అందించారు. ఇరువురికి బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఉద్యోగులు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. కార్యక్రమంలో బీటీపీఎస్ భూనిర్వాసిత ఉద్యోగుల సేవా సమితి సభ్యులు సంతోష్‌రెడ్డి, తంతరపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు వితరణ

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఫ్యాన్స్ సరిగా లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న బీటీపీఎస్ ఏఈ వరుణ్ విద్యార్థులకు శనివారం 4ఫ్యాన్‌లు అందించి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.రేవతి దేవి మాట్లాడుతూ.. విద్యార్థుల ఇబ్బందులు తెలుసుకుని సహాయం అందించడానికి ముందుకు వచ్చిన ఏఈ వరుణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యశస్వీ, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

బూర్గంపాడు: ఈ నెల 25, 26, 27వ తేదీల్లో మంచిర్యాలలో జరిగే ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మణుగూరు ఏరియా కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. శనివారం సారపాకలో మహాసభల ప్రచార పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం నిర్వహించాల్సిన భవిష్యత్ కార్యాచరణపై ఈ మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు వైఎస్‌రెడ్డి, రఫీ, పాషా, లక్ష్మి, కుసుమ, రమ, జీనత్, పాల్, వీరమళ్ల ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంపై హర్షం

గుండాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంతో మండల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల అధ్యక్షుడు తోలెం సాంబయ్య, ఇటెందుల అప్పారావు, నర్సింహులు, రామకృష్ణ, బుచ్చయ్య, చుక్కారావులు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆర్టీసీ.. సేవా కండక్టర్!

- నిరుపేదలకు నిత్యావసరాల అందజేత
- పార్కులు, పాఠశాలల్లో విగ్రహాల ఏర్పాటు
- కరోనా సమయంలో ఆపన్న హస్తం
- నుతారిగా పనిచేస్తూ సగం కూలి సేవలకు కేటాయింపు..



పల్లె ప్రకృతి వనంలో మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ రేగా, ఉపేందర్ (ఫైల్)



సురక్షా బస్టాండ్‌లోని గుంతల్లో సొంత ఖర్చులతో మట్టి పోయిస్తూ.. (ఫైల్)



మణుగూరు బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహం (ఫైల్)

మణుగూరుటౌన్: మణుగూరు మండలం ఆర్టీసీ డిపోలో ఓ సాధారణ కండక్టర్ సామాజిక సేవల్లో ముందు నిలుస్తున్నారు. విధులు నిర్వహిస్తునే ఉదార భావంతో నలుగురికి చేయూతనిస్తున్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన చెరుకుపల్లి ఉపేందర్‌కు 2009లో ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగం సాధించారు. మణుగూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధుల్లో చేరాడు. నాటి నుంచి సంపాధించిన దానిలో కొంత పరులకు సహాయం చేయాలనే తన తండ్రి మాటలు జ్ఞాపకం ఉంచుకున్నాడు. ఆ మేరకు.. మణుగూరు ఆర్టీసీ సుర్క్షా బస్టాండ్‌లో వేసవిలో వచ్చే ప్రయాణికుల దాహం తీర్చడానికి ఉపేందర్ 5 సంవత్సరాలుగా చలివేంద్రం నిర్వహిస్తున్నాడు. తన సొంత ఖర్చులతో కొత్త కుండలు, చలువ పందిరి ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి రోజూ మణుగూరు బస్టాండ్‌కు వచ్చి పోయే సుమారు 3 వేల మంది ప్రయాణికులకు దాహం తీర్చినట్టైంది. గతంలో ఈ బస్టాండ్ ఆవరణం బురదమయంగా ఉండటంతో సుమారు 6 టిప్పర్ల మట్టి తన సొంత ఖర్చులతో పోయించి ఆర్టీసీ అధికారుల మన్ననలు అందుకున్నారు. ఓసారి విధి నిర్వాహణలో ఉన్నప్పుడు ఖమ్మానికి చెందిన ఓ ప్రయాణికుడు తల్లాడలో దిగి సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. బస్సులో పడిపోయిన సెల్‌ను వెతికించి భద్రంగా అతనికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పద్మశ్రీ వన జీవి రామయ్యతో మణుగూరు డిపోలో మొక్కలు నాటించారు.

కూలి చేసి.. సేవలందించి..

కండక్టర్‌గా 8గంటల పనిచేసే ఉపేందర్.. ఆ మిగిలిన సమయంలో తనకు వచ్చిన తాపీ మేస్త్రీ పని చేస్తుంటారు. సెలవు దినాలనూ ఆ పనికి వినియోగించుకుంటారు. కూలిగా రోజుకు రూ.800 వస్తే.. అందులో రూ.400లను సామాజిక కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. అందులో భాగంగా ప్రపంచ మహిళా దినోత్సవం రోజున మణుగూరు మండలం

సండే స్పెషల్

గుట్ట మల్లారం పల్లె ప్రకృతి వనంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. మహిళలు స్ఫూర్తి పొందేందుకు ఇది సహకరిస్తుందని వారి భావన. చదువుపై పిల్లల్లో ఆసక్తి పెరిగేందుకు సరస్వతి విగ్రహాన్ని మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయించారు. నిరుపేద కుటుంబాలకు బియ్యం నిత్యావసర సరుకులు అందించారు. కరోనా సమయంలోను బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. ఇలా వ్యవహరించడానికి సాధారణంగా ఇంటి వారి నుంచి అడ్డంకులు రావచ్చు. కానీ ఉపేందర్ విషయంలో ఆయనకు అడ్డంకులు బదులు సహకారం అందింది. తన భార్య తోడుగా నిలిచి చేసే సేవల్లో పాలుపంచుకుంటోంది. మణుగూరులో గోదావరి వరదల సమయంలో అనేక మంది నిర్వాసితులను ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఆశ్రయం కల్పిస్తే.. వారికి ప్రతిరోజూ 100 మందికి సరిపడా భోజనాలు తన భార్య స్వయంగా తయారు చేసి బాధితులకు వడ్డించింది.



వరద బాధితులకు భోజనం అందిస్తున్న ఉపేందర్, ఆయన సతీమణి (ఫైల్)

సేవలోనే సంతోషం

ఉన్నదానితో సంతోషంగా ఉంటూ ఎంతో కొంత ఇతరులకు సహాయం అందించాలనే సంకల్పంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నాను. వచ్చిన జీతంలో ఎంతో కొంత వేచ్చించి చేస్తాను. పెద్ద పెద్ద కార్యక్రమాలకు తన మిత్రులు కొంత సహకారం అందిస్తారు. తోటి వారి సహకారం తోపాటు ఖాళీ సమయంలో కూలీ చేసి సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుంది. మా తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి అందించి సేవా స్ఫూర్తితోనే ఇటువంటి కార్యక్రమాలు చేయగలుగుతున్నాను.

– చేరుకుపల్లి ఉపేందర్, ఆర్టీసీ కండక్టర్, మణుగూరు డిపో

చర్లలో జర్నలిస్టుల ఆందోళన



ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న జర్నలిస్టులు

చర్ల: తెలంగాణా రాష్ట్రంలో ఓ మీడియా సంస్థపై తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం నిషేధాన్ని విధించడంపై చర్లలో శనివారం జర్నలిస్టులు నిరసన తెలియజేశారు. చర్లలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై బైటాయించిన జర్నలిస్టులు ప్రభుత్వ తీరును నిరస్తూ నినాదాలు చేశారు. మీడియా గొంతు నొక్కే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్ వరకు ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ బి.భరణిబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు దొడ్డా ప్రభుదాసు, కొంగూరు రమణారావు మాట్లాడారు. మీడియా సంస్థలను అణుగదొక్కే ప్రయత్నాలను ప్రభుత్వాలు విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో జర్నలిస్టులు పరుచూరి రవీంద్ర, భరణికుమార్, సంతోష్‌వర్మ, రామలక్ష్మణ్, కె.వెంకటేశ్వర్లు, సాగర్, డి.శ్రీనివాసరావు, డి.హరినాగవర్మ, వీరాచారి, కె.రాంబాబు, బి.అప్పారావు, ఎస్.నాగేశ్వరరావు, సాగర్, సీహెచ్.వెంకటేశ్వర్లు, సీహెచ్.గిరి, ఎస్.రుషికుమార్, కె.కౌషిక్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనం వాయిదా

భద్రాచలం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో భద్రాచలంలో తలపెట్టిన ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 25కు వాయిదా వేసినట్లు ఆయన క్యాంప్ కార్యాలయ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో తెలిపాయి. భద్రాచలంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో భద్రాచలం నియోజకవర్గ స్థాయి సమ్మేళనం ఆదివారం జరగాల్సి ఉంది. కానీ అకాల వర్షాల ప్రభావంతో దీనిని రద్దు చేశామని, తిరిగి 25న ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు ఈ మార్పును గమనించాలని వారు కోరారు.

స్థల పరిశీలన

మణుగూరురూరల్: త్వరలో జరగబోయే బీఆర్ఎస్ పార్టీ సభ్యుల ఆత్మీయ సమ్మేళన ఏర్పాటు కోసం కూనవరం గ్రామపంచాయతీలోని రేగులగండి గ్రామ సమీపంలో యున్న శ్రీభవాని లింగమంతుల స్వామి వారి దేవాలయ ఆవరణలో అనువైన స్థలంగా పరిగణించి మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏనిక ప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముత్యం బాబు, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, రైతు సంఘం కన్వీనర్ వెంకట్‌రెడ్డి, నాయకులు వీరన్నబాబు, రామారావు, మేకల రవి, నాగేశ్వరరావు, గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీదేవి జాతర

గుండాల: తూరుబాక గ్రామంలో జోగవారి ఇలవేల్పు అయిన లక్ష్మీదేవి జాతర శనివారం ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు, గంగాస్నానం చేయించి గుడిలో ప్రతిష్ఠించడంతో నిండుజాతర ఘనంగా జరిగింది. శనివారం ఆలయం వద్ద లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. జోగ రాంబాబు, అనసూర్య దంపతుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జోగ పోతయ్య, భద్రయ్య, దమ్మయ్య, పెద జోగయ్య, బుచ్చయ్య, చిన నర్సయ్య, సారయ్య, సమ్మయ్య, పగడయ్య, ఎదలపల్లి కృష్ణ, కాంతారావు, లక్ష్మయ్య, గొగ్గెల లక్ష్మీనారాయణ, సత్యం, రామస్వామి, లింగయ్య, సందయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ప్రతిష్ఠా మహోత్సవం

దమ్మపేట: మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామంలో భక్తాంజనేయ, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. స్థానిక ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి.. గొర్రెగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణాన్ని జరిపించారు.

నేడు ముత్యాలమ్మ తల్లి జాతర



జాతరకు ముస్తాబైన ఆలయం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ, ఏపీ సరిహద్దులో భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ఆలయం వద్ద జాతర ఉత్సవాలు ఈ నెల 23వ తేదీ వరకు సాగనున్న నేపథ్యంలో జాతర ముగిసే వరకు దాదాపు రెండు లక్షలకుపైనే భక్తులు తరలి వస్తారు. ఆలయం వద్ద ఎంతో వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంతా సిద్ధం చేశారు. అదే విధంగా జాతర ఉత్సవాల నేపథ్యంలో ఆలయం వద్ద భక్తులు, చిన్నారుల కోసం రంగుల రాట్నం, బ్రేక్ డ్యాన్స్, ఊగే ఉయ్యాలతోపాటు మరికొన్ని ఆటవిడుపు యంత్రాలు ఏర్పాటు చేశారు. ఆలయానికి ఇరువైపులా, ఆలయం పరిసరాలను విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ కేటాయించగా, ఆలయం వద్ద పోలీస్‌లతో భద్రత ఏర్పాటు చేశారు.

నేడు మహాలక్ష్మి అవతారంలో..

జాతర ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు అమ్మవారి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అందులో భాగంగా జాతర తొలి రోజున అమ్మవారు మహాలక్ష్మి అమ్మవారి అవతారంలో, అలాగే ఈ నెల 20వ తేదీన అమ్మవారు మావుళ్లమ్మ అవతారంలో, 21న నూకాలమ్మ అమ్మవారి అలంకరణలో, 22వ తేదీన కుంకుళ్లమ్మ అమ్మవారి అవతారంలో, 23వ తేదీన తలుపులమ్మ అమ్మవారి అలంకరణలో దర్శనం ఇస్తారు. ప్రతి రోజూ ఆలయం వద్ద అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయనున్నారు. అదే విధంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

బీఎస్పీ నూతన కార్యాలయం ప్రారంభం



మణుగూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)నూతన కార్యాలయాన్ని శనివారం ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఇర్పా రవి ప్రారంభించారు. తొలత పార్టీ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జ్ అలెం కోటి ఆవిష్కరించారు. పట్టణంలో భారీ ప్రదర్శన చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పినపాక నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో నూతన కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకుడు పాక వెంకటేశ్వర్లు, పీక మల్లేష్, ఇసంపల్లి శివ, బూర్గుల కరుణాకర్, శోభన్, బొమ్మెర రాంబాబు, పినపాక నియోజవర్గంలోని మండల అధ్యక్షుడు అననియా, పినపాక నియోజకవర్గ ఉపాధ్యక్షుడు యనగంటి సంపత్‌కుమార్, పూనెం నరేష్, గుండాల మండల అధ్యక్షుడు ఈసం వీరస్వామి, మడకం సైదులు, జబ్బ కృష్ణ, బిట్‌సెల్ అధ్యక్షుడు ఇర్పా పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన వర్షం.. నష్టం



అశ్వారావుపేటరూరల్: వేదాంతపురంలో దెబ్బతిన్న పొగాకు తోట



చంద్రుగొండ: రావికంపాడులో పట్టాలపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

అశ్వారావుపేటరూరల్: అకాల వర్షంతో రైతన్నల్లో ఆందోళన నెలకొంది. అశ్వారావుపేట మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచే వాతావరణ చల్లబడి, మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. మండలంలోని ఊట్లపల్లి, వేదాంతపురం, నల్లబాడు, అశ్వారావుపేట, తిమ్మాపురం, వినాయకపురం, నారాయణపురం గ్రామాల్లో అత్యధికంగా సాగులో ఉన్న పొగాకు సాగుకు ఆకాల వర్షంతో నష్టం వాటిల్లుతుందని, వర్షం కారణంగా కోత దశలో ఉన్న పొగాకు జిడ్డు కారిపోయి నాణ్యత దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. దీని ప్రభావం ధర్పై పడి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని గుమ్మడవల్లి, కొత్తూరు, అనంతారం, గాండ్లగూడెం గ్రామాల్లో సాగులో కల్లాల్లో ఆరబోసిన మిరప కాయలు, మొక్కజొన్న కంకులు తడిసిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకున్నారు.

చంద్రుగొండ: తుఫాను ప్రభావంతో రెండోరోజు శనివారం మండలంలో ఉరుములు మెరుపులతో భారీవర్షం పడింది. అకాలవర్షాలు మిర్చిరైతుల పాలిట శాపంగా పరిణమించాయి. కల్లాల్లో ఉన్న మిర్చిపంటకు వర్షం కారణంగా నష్టం వాటిల్లింది. పెద్ద ఎత్తున గాలిదుమారం మామిడిరైతులకు నష్టం చేకూర్చింది. పంటనష్టం అంచనాలు తెలియాల్సి ఉంది.

భద్రాచలంటౌన్: తుఫాన్ ప్రాభావంతో భద్రాచలం డివిజన్‌లో శనివారం కూడా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మొదలైన వర్షం.. రాత్రి వరకు కొనసాగింది. ముడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో పాటు ఉద్యోగులు, రోజు వారి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారిగా భారీగా పడుతున్న వర్షంతో లోతట్టు కాలనీల్లో వరద నీరు రోడ్లపై చేరడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎక్కడబడితే అక్కడ వరద నీరు చేరడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో అంటు వ్యాధులు వ్యాప్తి చేందే ప్రమాదం పొంచివుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పంచాయితీ అధికారులు వర్షం వెంటనే స్పందించి శానిటేషన్ పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యలు ఉండొద్దు..



గుర్రాల చెరువు గ్రామంలో మోటార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు ఉంటాయని, వీటిని సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గుర్రాల చెరువు గ్రామ పంచాయతీలో శనివారం నూతన మోటారును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొంత మంది స్థానిక మహిళలు తమ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, దాంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని కొద్ది రోజుల క్రితం తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతో సమస్యను పరిష్కరించేందుకు రూ.1లక్షా 60వేల విలువగల మోటారును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలపాల దుర్గయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, గొడవర్తి వెంకటేశ్వరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మంచి కథతో సినిమా తీస్తా..

బూర్గంపాడు: ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో భద్రాద్రి సినీ క్రియేషన్స్ పేరుతో నిర్మాణ సంస్థను రిజిస్ట్రేషన్ చేయించినట్లు షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ చింతమళ్ల నాగరాజు తెలిపారు. భద్రాద్రి సినీ క్రియేషన్స్‌ను రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ వివరాలను పినపాక పట్టీనగర్ గ్రామంలో శనివారం ఆయన వెల్లడించారు. పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన చింతమళ్ల నాగరాజు షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్‌గా మేకర్‌గా గత ఆరేళ్లుగా పనిచేస్తున్నారు. భద్రాద్రి సినీ క్రియేషన్స్ పతాకంపై మంచి కథతో సినిమా తీస్తానని ఆయన శనివారం ప్రకటించారు. ఇప్పటి వరకు ఓ పిల్ల నీవల్ల, ఒక్కడే కానీ ఇద్దరు, ప్రేమకు స్వాగతం వంటి పలు షార్ట్ ఫిల్మ్‌లను తీశానన్నారు. ప్రస్తుతం మూడు షార్ట్ ఫిల్మ్స్ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయన్నారు. భద్రాద్రి జిల్లా ఖ్యాతిని పెంచేలా మంచి కథతో తొందరలోనే తన స్వీయ దర్శకత్వంలో సినిమా తీస్తానన్నారు. ఇప్పటికే కథను సిద్ధం చేసుకున్నానన్నారు. చిత్ర నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకుంటున్నానని తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



పట్టుబడిన గుడుంబా క్యాన్లతో అబ్కారీ సిబ్బంది

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడుకు సమీపంలోని గుడుంబా తయారీ స్థావరాలపై శనివారం ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ రహిమున్నీసా ఆదేశానుసారం ఎస్సై మురళీకృష్ణ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. దోమలవాగు సమీపంలోని ఓ గుడుంబా తయారీ స్థావరం వద్ద ఐదు డ్రమ్ములలో నిల్వచేసిన 250 లీటర్ల పానకాన్ని పారబోశారు. ఈ సందర్భంగా ఎస్సై మురళీకృష్ణ మాట్లాడుతూ.. అమోనియాతో తయారుచేస్తున్న నాటు సారా అత్యంత హానికరమన్నారు. ప్రస్తుతం చాలామంది అమోనియాను సారా తయారీకి ఉపయోగిస్తున్నారని, అది తాగిన వారు అనారోగ్యంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. గ్రామాల్లో గుడుంబా తయారు చేసిన, అమ్మినా ఎక్సైజ్‌శాఖ అధికారులకు సమాచారమివ్వాలన్నారు. సమాచారమిచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది వీరబాబు, మల్సూర్, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ ఆటలు సాగనివ్వం



మణుగూరుటౌన్: జన చైతన్య యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మణుగూరుటౌన్: వీరతెలంగాణ రైతాంగ పోరాటాలు నిర్వహించిన తెలంగాణ గడ్డమీద బీజేపీ ఆటలు సాగనివ్వమని సీపీఎం సీనియర్ నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మణుగూరులోని సీపీఎం కార్యాలయంలో జనచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలన్నారు. సంక్షేమం మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం దేశ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతుందన్నారు. సీపీఎం అఖిల భాతర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో జన చైతన్య యాత్ర కొనసాగుతుందన్నారు. యాత్రలో సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లమండలంలోకి నేడు యాత్ర ప్రవేశిస్తుందన్నారు. యాత్రలో మణుగూరు నుంచి అధిక సంఖ్యలో మోటర్ సైకిల్ ర్యాలీతో యాత్రలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు లెనిన్‌బాబు, టీవీఎంవీ ప్రసాద్, ఉప్పతల నర్సింహారావు, బొల్లం రాజు, మాచవరం లక్ష్మణ్‌రావు, గుర్రం నర్సయ్యలు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మార్చి 19, 20 తేదీల్లో జన చైతన్య యాత్రను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చా వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుంకే జన చైతన్య యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌లోని చర్ల, దుమ్ముగూడెం మండల కేంద్రంలో జరిగే భారీ బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని పాల్గొంటారని తెలిపారు. జన చైతన్య యాత్రను నియోజకవర్గ ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోస్టర్లు ఆవిష్కరణ

మణుగూరురూరల్: జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన గోడపత్రికలను సీపీఎం నాయకులు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం కోసం కొనసాగుతున్న జనచైతన్య యాత్రలో పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. లెనిన్‌బాబు, టీవీఎంవీ ప్రసాద్, నరసింహారావు, రాజు, లక్ష్మణ్‌రావు, నరసయ్య పాల్గొన్నారు.